క్లుప్తంగా

పైపులైన్ పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ టౌన్: పట్టణంలోని అర్బత్‌కాలనీ, వాసవీ కాలనీల్లో శనివారం మున్సిపల్ అధికారులు కొత్త పైపులైన్ వేయించారు. 6న సాక్షి దినపత్రికలో 'గుంతలు తవ్వారు.. పనులు మరిచారు' శీర్షికన ప్రచురితమైన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. కథనం ద్వారా ఎన్నో ఏళ్లుగా నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కరించినందుకు సాక్షి యాజమాన్యానికి ఆయా కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీ వాసులకు మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ రమేష్ వెల్లడించారు.

నిరుపయోగంగా పోలీస్ బ్యారక్



నిజాంసాగర్(జుక్కల్): పోలీసుల కోసం నిర్మించిన బ్యారక్ నిరుపయోగంగా ఉంది. పోలీస్ స్టేషన్ ఆవరణలో క్వార్టర్స్ లేకపోవడంతో లక్షలు ఖర్చు చేసి బ్యారక్ నిర్మించారు. అయితే అందులో సరైన సదుపాయాలు లేకపోవడంతో వాటిని ఉపయోగించుకోవడం లేదు. దీంతో శిథిలావస్థకు చేరుకుంది. జిల్లా అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.

పాస్టర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎల్లారెడ్డి: మండల పాస్టర్ల సంఘం కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెవరెండ్ భాస్కర్, ఉపాధ్యక్షుడిగా విజయ్‌పాల్, కార్యదర్శిగా హెప్సీబా, కోశాధికారిగా రాజ్‌దాస్, సలహాదారులుగా రెవరెండ్ ప్రసాద్, మాణిక్యరావు ఎన్నికయ్యారు.

ప్రభుత్వ పథకాలు అందజేయాలి



ఎల్లారెడ్డి: ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు విఠల్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ప్యాలాల రాములు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: పశు మిత్రలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, పశు మిత్రుల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొత్త నర్సింలు, పశుమిత్ర నాయకులు శ్రీలత, రజిని, రోజా, వినోద, సంధ్య, మమత, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు వృథా

పెద్దకొడప్‌గల్(జుక్కల్): భగీరథ పథకం నీరు వృథాగా పోతున్నా అధికారులు స్పందించడం లేదు. మండలంలోని టికారం తండా, బురుగుపల్లిలో పైపు నుంచి నిత్యం తాగునీరు వృథాగా పోతున్నా వాటిని పంచాయతీ అధికారులు అరికట్టే ప్రయత్నం చేయడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు.



బడి బయట పిల్లల గుర్తింపు

- ఇటుక బట్టీలు, ఇతర పనుల్లో చిన్నారులు
- పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు



నిజాంసాగర్ మండలంలో..



కామారెడ్డిలోని పాతరాజంపేట ఇందిరమ్మ కాలనీలో గుర్తించిన బడి బయట పిల్లలు

కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో శనివారం 20 మంది బడి బయట పిల్లలను గుర్తించారు. పాతరాజంపేట యూపీఎస్ ఉపాధ్యాయుడు బీఎన్ గిరి, సీఆర్‌పీ చిరంజీవి ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించాలని సూచించారు. తమ కాలనీలో పాఠశాల లేదని రవాణా సౌకర్యం కల్పిస్తే పాతరాజంపేట, నర్సన్నపల్లి, క్యాసంపల్లి గ్రామాల్లోని చేర్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామ ఆవాస ప్రాంతంలో బడి బయట ఉన్న రాంచరణ్ అనే చిన్నారిని సీఆర్పీలు గుర్తించి, బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడి మహమ్మద్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకరమణ, సీఆర్పీలు వెంకట్రాంగౌడ్, శంకర్‌గౌడ్, ఐఈఆర్‌టీలు చిన్నసాయులు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని నల్లమడుగు పెద్ద తండా, లింగంపేట, కొయ్యగుండు తండా తదితర గ్రామాల్లో బడిబయట పిల్లలను సీఆర్పీలు గుర్తించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కు పాఠశాలలో చేర్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు విజయ్‌కుమార్, సంజీవ్‌కుమార్, గంగాధర్, సంగాగౌడ్, సత్యనారాయణ, రాజు, ఐఈఆర్‌పీలు శ్యామల, అనిత తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట మండలంలో..

క్రీడా పోటీలకు ఆహ్వానం..

తాడ్వాయి: మండల కేంద్రంలో 11 నుంచి 13వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ సాయిరెడ్డి వెల్లడించారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారంతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో గ్రామం నుంచి ఒక టీం మాత్రమే పాల్గొనాలని సూచించారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 51 వేలు, రెండో స్థానం జట్టుకు రూ. 20 వేలు, మూడవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 10 వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకోసం 75694 90360, 99485 90920, 63033 05128 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ నర్సిములు, సర్పంచ్ సంజీవులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, భరత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాజు, ప్రతాపరెడ్డి, శ్రీనివాస్, పీడీ హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు

ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించినందుకు పురస్కారం



షేక్ షార్జిల్‌ను అభినందిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: కోవిడ్ సమయంలో పేద విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా పాఠాలు చెప్పిన జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం కుమారుడు, బాన్సువాడకు చెందిన షేక్ షార్జిల్‌ను కలెక్టర్ అభినందించారు. ఆల్ ఇండియా అడ్వొకేట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బాలకృష్ణ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం ఆయన కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిశారు. షేక్ షార్జిల్ మూడేళ్లుగా ఢిల్లీలో సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 8, 9 తరగతుల విద్యార్థులకు ఇంగ్లీషు లాంగ్వేజ్ ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ, అచ్చంపేట ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అలుగు నిర్మాణానికి చర్యలు



అలుగును పరిశీలిస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్ పెద్దచెరువు అలుగులను శనివారం నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. దశాబ్దాల కిందట నిర్మించిన అలుగు శిథిలావస్థకు చేరడంతో సాగునీరు వృథా అవుతోందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలుగు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ జగదీష్, సర్పంచ్ జిన్న రఘురామయ్య, మల్లారెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



అంగన్‌వాడి కేంద్రంలో సూపర్‌వైజర్ లక్ష్మి

నిజాంసాగర్(జుక్కల్): చిన్న పిల్లల ఆరోగ్యంపై తల్లులతో పాటు టీచర్లు తగిన శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని గోర్గల్, మాగి గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టిక అహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. ఆమె వెంట ఆరోగ్య కార్యకర్త బట్టు సునిత, అంగన్‌వాడి టీచర్లు సులోచన, శోభ ఉన్నారు.

జీవన ఎరువుతో అధిక దిగుబడులు

మాచారెడ్డి: భాస్వరం కరిగించే ఫాస్ఫరస్ సొల్యుబుల్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) అనే జీవన ఎరువు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని కామారెడ్డి ఏడీఏ అపర్ణ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని అక్కాపూర్‌లో భూమయ్య అనే రైతు పొలంలో జీవన ఎరువు వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. జీవన ఎరువు వాడకంతో హెక్టారుకు ఒక బస్తా డీఏపీ ఖర్చు తగ్గుతుందన్నారు. వ్యవసాయాధికారి రాజలింగం, ఏఈవోలు రాజేష్, ప్రభాకర్, శివ చైతన్య పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలో పంటల సాగుపై ఏఈవో అఖిలేషు అవగాహన కల్పించారు. పీఎస్‌బీ ద్రావణం వాడే విధానం గురించి వివరించారు. ఆర్‌బీఎస్ కో ఆర్డినేటర్ తక్కల్ల బాపురెడ్డి, నేతలు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సర్వే

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని శేర్‌ఖాన్‌పల్లిలో సాగు చేసిన ఆరుతడి పంటలను క్లస్టర్ ఏఈవో గ్రీష్మ సర్వే నిర్వహించి అనంతరం వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ఎల్లారెడ్డి: మండలంలోని రత్నాపూర్‌లో వరి పంటలను ఏఈవో రాజాగౌడ్ పరిశీలించారు. పంటల సాగు విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటకు ఆశించిన కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరాకు 250 మి.లీ క్లోరోఫైరిఫాస్ ద్రావణం 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అపర్ణ

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాప్రాంగణం ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజ్‌దాస్

నాగిరెడ్డిపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను యువత సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహార్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్ సూచించారు. మండలంలోని ఆత్మకూర్‌లో శనివారం సర్పంచ్ బాల్‌రెడ్డితో కలిసి క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, ఈసీ సాయిలు, పంచాయితీ కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్లాంటు పరిశీలన

ఎల్లారెడ్డి: ప్రభుత్వ ఐటీఐ ఎలక్ట్రీషియన్ విద్యార్థులు శనివారం నిజాంసాగర్ మండలంలోని హసన్‌పల్లి పవర్ జనరేషన్ ప్లాంటును పరిశీలించారు. విద్యుత్ తయారీ విధానం గురించి అవగాహన కల్పించినట్లు ఐటీఐ సిబ్బంది వెల్లడించారు.



ప్లాట్లు కొంటున్నారా.. తస్మాత్ జాగ్రత్త

- కొనుగోలుదారులకు టోకరా వేసి పరారైన రియల్టర్
- లబోదిబోమంటున్న బాధితులు

బాన్సువాడ టౌన్: రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలుదారులను నిలువునా ముంచుతున్నారు. బాన్సువాడ పట్టణానికి చెందిన ఓ వస్త్ర దుకాణ నిర్వాహకుడు పట్టణానికి సమీపంలో ఉన్న ఓ వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేశాడు. మూడు విడతలు డబ్బులు తీసుకున్న అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారి పరారయ్యాడు. ఇలా ఎంతో మంది డబ్బులు చెల్లించి మోసపోయారు. బాన్సువాడ మున్సిపాలిటీ అయిన తర్వాత ప్లాట్లకు డిమాండ్ పెరిగింది. దీంతో రియల్టర్లు నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు లే అవుట్లు వేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో సామాన్యుల నుంచి డబ్బులు తీసుకొని ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించకుండా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మోసం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బాన్సువాడలో వెలసిన ఓ వెంచర్

బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతం కావాలి



సమ్మేళనంలో పాల్గొన్న కామారెడ్డి బీజేపీ నాయకులు



వర్చువల్‌గా మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

సాక్షి, నెట్‌వర్క్: బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతం కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సూచించారు. శనివారం వర్చువల్‌గా జరిగిన బూత్ స్థాయి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి పట్టణం ఓ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశానికి పలువురు నాయకులు హాజరయ్యారు. జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించి బిచ్కుందలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నియోజకవర్గం ప్రభారి రితేష్ రాథోడ్, ఎల్లారెడ్డిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పది రోజులకోసారి విధులకు వస్తే ఎలా?

- సర్వసభ్య సమావేశంలో ఇరిగేషన్ ఏఈపై ఎంపీపీ రాజ్‌దాస్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఏఈ కన్నయ్య, చిత్రంలో ఎంపీపీ

నాగిరెడ్డిపేట: వారం, పది రోజులకోసారి విధులకు హాజరవుతూ ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని ఇరిగేషన్ ఏఈ కన్నయ్యపై ఎంపీపీ రాజ్‌దాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖకు సంబంధించి ఏఈ కన్నయ్య మాట్లాడుతుండగా ఎంపీపీ కలుగజేసుకొని పోచారం ఆయకట్టు పరిధిలో నీటి విడుదలకు సంబంధించి తైబందీ సమావేశం నిర్వహించకముందే నీటి విడుదల తేదీని ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. సకాలంలో తైబందీ సమావేశం నిర్వహించకపోవడం వల్ల ప్రధాన కాలువతో పాటు పంటకాలువల సమస్యలు పరిష్కరించే వీలు లేకుండా పోయిందన్నారు. పోచారం ప్రధాన కాలువ కట్టపై పెరిగిన ముళ్ల పొదలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని గోలిలింగాల సర్పంచ్ మురళి కోరారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సయీద్ అహ్మద్ మస్రూర్ కోరారు. వీఆర్‌ఏలు పంచాయతీ పనులకు సహకరించడం లేదని అచ్చాయపల్లి సర్పంచ్ శైలజ తహసీల్దార్ దృష్టికి తీసుకరాగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాల్లో నిర్వహించే సమావేశాలకు సర్పంచ్, ఎంపీటీసీలను ఆహ్వానించాలని జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు సూచించారు. వైకుంఠదామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వెంకంపల్లి సర్పంచ్ శుభాకర్‌రెడ్డి ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్‌ను కోరారు. సమావేశంలో ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యుడు షాహెద్‌పాష తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు లేకపోతే పేదలకు సేవలు ఎలా?

పిట్లం: పిట్లంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి గత నెల 3న వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావ్ శిలఫలకం వేసినా ఇప్పటికీ పనులు ప్రారంభించక పోవడం శోచనీయం అని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బొర్గి సంజీవ్ పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను నియమించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన వైఎస్సార్‌టీపీ మండల ప్రధాన కార్యదర్శి సాయిలుతో కలిసి పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఆస్పత్రిలో ఐదుగురు రెగ్యులర్ డాక్టర్లకుగాను కేవలం ఒక దంత వైద్యుడు మాత్రమే ఉన్నారని అయన కూడా సెలవులో ఉన్నారని పేర్కొన్నారు. ఇలా అయితే పేదలకు వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. ట్రైనీ డాక్టర్లు మాత్రమే విధుల్లో ఉన్నారని తెలిపారు.



ఆస్పత్రిలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

చలో హైదరాబాద్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాల ఆవిష్కరణలో విద్యార్థి సంఘం నేతలు

బాన్సువాడ టౌన్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న బీసీ విద్యార్థి యువజన పోరు యాత్రకు సంబంధించిన చలో హైదరాబాద్ కరపత్రాలను బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్‌గౌడ్ ఆవిష్కరించారు. చదువు కోసం, సామాజిక న్యాయ సాధన కోసం పాలమూరు నుంచి పట్రం వరకు కొనసాగిన బీసీ విద్యార్థి యువజన పోరు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వనం గంగాధర్, నాయకులు దత్తు, జీవన్, అనీల్, నవీన్, పండరి, గంగారం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక చేయూత



చెక్కులను పంపిణీ చేస్తున్న విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూత లభిస్తుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. నియోజికవర్గంలోని 39 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అందిస్తు న్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, జెడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, నాయకులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, బల్వంత్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విప్‌ను కలిసిన పోలీసు అధికారులు

కామారెడ్డి క్రైం: డివిజన్ పరిధిలో పని చేస్తున్న పోలీసు అధికారులు శనివారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ ముజీబొద్దీన్‌లను కామారెడ్డిలోని ప్రభుత్వ విప్ నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ సోమనాథం, సీఐలు నరేష్, శ్రీనివాస్‌తో పాటు ఎస్సైలు విప్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఈ నెల 9 నుంచి 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ధర్మారావుపేట ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మురళి తెలిపారు.

బిల్లులు మంజూరు చేయాలని వినతి

పిట్లం: కోవిడ్ సమయంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సరఫరా చేసిన సిరంజీలకు సంబంధించిన బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని మెడికల్ షాపు నిర్వాహకుడు యాదగిరి ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రభుత్వ ఆస్పత్రిలో అవసరమైన మేరకు సిరంజిలు లేక పోవడంతో తాను సరఫరా చేసినా బిల్లులు చెల్లించలేదన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

బీబీపేట: మండలంలోని మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన కాసం శివారెడ్డి పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం నిర్మించాలి

ఎల్లారెడ్డి: మండలంలోని దావల్‌మల్క పల్లి గ్రామానికి మంజూరైన పంచాయతీ భవనాన్ని పాత గ్రామంలోనే నిర్మించాలని గ్రామస్తులు శనివారం ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. పాత గ్రామంలో నిర్మాణానికి అనువైన స్థలాన్ని దాతలు ఇచ్చినట్లు తెలిపారు.

9న ఆటో వేలం

కామారెడ్డి అర్బన్: ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆటోను స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం వద్ద 9వ తేదీ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

జోరుగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా సాగుతుంది. శుక్రవారం నాటికి 1.97 లక్షల టన్నులకు పైగా క్రషింగ్ జరిగినట్లు షుగర్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

ఘనంగా కుంకుమ పూజ

తాడ్వాయి: మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి ఘనంగా కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పూజలో పాల్గొన్నారు.

